క్లుప్తంగా

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి



శిక్షణ ఇస్తున్న ఆర్‌ఓ వెంకటశివ

శ్రీరంగరాజపురం: ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఓ వెంకటశివ సూచించారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడుతూ 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా సంబంధిత అధికారులు పగడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి అల్లర్లు, గొడవలకు తావివ్వకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకే అన్ని రాజకీయ పార్టీల ప్రచారాలను పరిసమాప్తం చేయాలన్నారు. ఓటు విలువను ప్రజలకు తెలియజేసి ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే సంక్షేమం



బొమ్మన్‌దొడ్లలో ప్రచారం చేస్తున్న నాయకులు

వెదురుకుప్పం: ప్రతి గడప వద్దకు సంక్షేమ పథకాలు రావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లం గ్రామ సచివాలయ పరిధిలోని బొమ్మన్‌దొడ్ల, కోణింగిపల్లె, పచ్చికాపల్లం పేట గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కే.కృపాలక్ష్మి గెలుపునకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల తలరాతలు మారాలంటే జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జేసీఎస్ కన్వీనర్ బట్టి సుబ్రమణ్యం, ఏఎంసీ చైర్మన్ మునస్వామి, యువత నాయకుడు నరేష్‌రెడ్డి, నాయకులు భీమశంకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ, ఎంపీటీసీ మునిచంద్రారెడ్డి, నాయకులు హేమశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు చంద్రారెడ్డి, రవికుమార్ రెడ్డి, మురళీ, ఈశ్వరరెడ్డి, రాజవేలు పాల్గొన్నారు.

కృష్ణారామాపురంలో ఫ్యాను జోరు



ప్రచారం చేస్తున్న మంత్రి రోజా వదిన లక్ష్మి

నగరి : రూరల్ మండలం కృష్ణారామాపురంలో ఫ్యాను హోరు జోరుగా వినిపించింది. మంత్రి ఆర్కే రోజా వదిన లక్ష్మి శుక్రవారం ఈ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లిన ఆమె తన ఆడపడుచు ఐదేళ్లలో ఎంత అభివృద్ధి చేసిందో వివరించారు. ఆ అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి మీ ఇంటి ఆడబిడ్డను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగు పూరి గుడిసెలు దగ్ధం



పద్మసరస్సు ఎస్టీకాలనీ సమీపంలో కాలిపోతున్న పూరిగుడిసెలు

కార్వేటినగరం: నాలుగు పూరి గుడిసెలు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని పద్మసరస్సు ఎస్టీ కాలనీలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. పద్మసరస్సు ఎస్టీ కాలనీకి సమీపంలోని కాలువ గట్టుపై నివాసం ఉంటున్న వేలు, సంధ్య, వినోద్, చిన్నరాజ్‌కు చెందిన పూరి గుడిసెల్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో నాలుగు గుడిసెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన వెంకటేష్ గుడిసెలు అంటుకున్న విషయాన్ని పుత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అలాగే సమాచారం అందుకున్న ఎంపీపీ లత, స్థానిక సర్పంచ్ ధనుంజయ వర్మ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయించడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో అక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు. గుడిసెలు కాలిపోవడంతో బాధితులు కట్టుబట్టలతో బయపడినట్లు అక్కడి వారు తెలిపారు.

పోటెత్తిన అభిమానం



నగరి ఎమ్మెల్యే అభ్యర్థి రోజాను ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి



పుత్తూరులో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనం

- సీఎం జగన్ సభ గ్రాండ్ సక్సెస్
- జనంతో కిక్కిరిసిన ప్రధాన రహదారులు
- ఉదయం నుంచే సభా ప్రాంగణానికి చేరిన జనం
- మండుటెండలో జగన్‌కు జేజేలు పలికిన వైనం
- సీఎం ప్రతి మాటకు ప్రతిస్పందన అపూర్వం

పుత్తూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా శుక్రవారం పుత్తూరులో ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయింది. ఆడ, మగ, చిన్న, పెద్ద తేడా లేకుండా వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకుల ప్రేమాభిమానంతో పుత్తూరు పట్టణం పోటెత్తింది. అన్ని రహదారులు జనసంద్రమయ్యాయి. సీఎం జగన్ పర్యటన ఆద్యంతం అభిమానులు, కార్యకర్తల నినాదాలు, కేరింతలతో హోరెత్తింది. సీఎం.. సీఎం.. జై జగన్, జైజై జగన్ అంటూ పుత్తూరు పట్టణం దద్దరిల్లింది. సీఎం ప్రసంగంలో తాను చేసిన మంచి పనుల్లో చంద్రబాబు తన 14 ఏళ్ల హయాంలో ఒక్కటైనా చేశారా అంటూ ప్రశ్నించడంతోటే.. జనంలో నుంచి లేదు..లేదు. లేదు..లేదు..లేదు అంటూ రెండు చేతులెత్తి సమాధానం చెప్పడం సభకే హైలెట్. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి మరింత జరగాలన్నా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి రోజమ్మను గెలిపించాలని సీఎం కోరగానే.. అన్నా మళ్లీ నువ్వే సీఎం, నీకే మా ఓటు అంటూ ప్రజల నుంచి స్పందన అపూర్వం.

అంతులేని అభిమానం ..

పుత్తూరు ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. హెలికాప్టర్ నుంచి పుత్తూరులో అడుగు పెట్టిన సీఎం జగన్ సభాస్థలికి బస్సులో బయలుదేరిన క్షణం నుంచి సభ ముగిసి తిరిగి ఆయన హెలీప్యాడ్ చేరుకునేంత వరకు ఆయన వెంటే అభిమానులు పరుగులు తీశారు. సభ అనంతరం ఆయన ప్రజలకు బస్సులో నుంచే అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సీఎం జగన్‌ను దగ్గర నుంచి చూసేందుకు వేలాదిగా తరలివచ్చారు. వీడియోలు, ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. పట్టణంలోని రోడ్లకు ఇరువైపులా నిలబడి ఎర్రటి ఎండను లెక్క చేయకుండా సీఎం ప్రసంగాన్ని ఆద్యంతం తిలకించారు.

ఖాయమైన రోజమ్మ విజయం..

సీఎం జగన్ రాకతో నగరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీలో జోష్ తారాస్థాయికి చేరుకుంది. చంద్రబాబు మోసాలను కళ్లకు కట్టినట్లు చెప్పిన సీఎం మాట తీరుతో నగరిలో మంత్రి రోజా విజయం ఇక నల్లేరుపై నడకే అనే మాటలు వినిపిస్తున్నాయి. సైకిల్ పని అయిపోయిందటున్నారు నగరి జనం.



ఇదే మన గుర్తు ఫ్యాన్ అని ప్రజలకు చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



బైక్‌పై వస్తున్న మున్సిపల్ చైర్మన్ హరి



బహిరంగ సభకు విచ్చేస్తున్న సీఎం జగన్‌కు అభివాదం చేస్తున్న పార్టీ శ్రేణులు

నారా వైరస్ కరోనా కంటే డేంజర్



ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆర్‌కే రోజా

- ఈ వైరస్ నుంచి కాపాడే వ్యాక్సిన్ ఒకటే.. అదే ఓటు
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : నారా చంద్రబాబు అనే వైరస్ కరోనా కన్నా డేంజర్ అని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శుక్రవారం నగరి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు కాకవేడు, చింతల పట్టెడ, రూరల్ మండలం అడవి కొత్తూరులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు గజమాలలు, హారతులతో ఆమెను ఆహ్వానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపైనా, రోజమ్మపైనా తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. తనను ఆశీర్వదించి గెలిపించినందుకు చేసిన అభివృద్ధిని ప్రత్యక్ష సాక్ష్యాలతో మంత్రి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారా వైరస్ కరోనా కన్నా డేంజర్ అని ప్రజలు తెలుసుకోవాలన్నారు. కరోనా వైరస్ ప్రభావం రెండేళ్లు మాత్రమే అని నారా వైరస్ సోకితే ఐదేళ్లు విలవిల్లాడిపోవాల్సిందే అన్నారు. ఆ వైరస్ సోకకుండా కాపాడే వ్యాక్సిన్ ఒకటుందని అదేమీ ఓటన్నారు. 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైరస్‌లాంటి టీడీపీ కూటమిని తరిమి కొట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్లు వెంకటరత్నం రెడ్డి, బాలన్, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేమంతా సిద్ధమంటూ కదలిన సాఫ్ట్‌వేర్లు

గంగాధర నెల్లూరు: సంక్షేమ ప్రదాత, పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి మరోసారి పట్టం కడుదామంటూ సుమారు 100 మందికి పైగా బెంగళూరులో స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు స్వగ్రామాలకు వచ్చి ప్రచారం చేశారు. శుక్రవారం మండల పరిధిలోని వేపంజేరి పంచాయతీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, స్థానిక యువత సర్పంచ్ సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ముసలయ్యగారిపల్లిలో ప్రచారాన్ని ప్రారంభించారు. గడప వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగనన్నకు మరో అవకాశం ఇచ్చి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామని నినాదాలు చేశారు. ముందుగా భారీ బైక్ ర్యాలీను ప్రారంభించారు.

మేమంతా జగనన్న గెలుపు కోసం సిద్ధం..

వత్తిరీత్యా తాము బెంగళూరులో స్థిరపడినప్పటికీ, రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. సోమవారం నాడు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెదిరెడ్డి, భూమిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, బాలాజీ రెడ్డి, భూమిరెడ్డి రవిరెడ్డి, జయచంద్రారెడ్డి, వరదారెడ్డి, తరుణ్ రెడ్డి, జయచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, కార్తీక్, లోకేష్ రెడ్డి, పురుషోత్తం, నాగరాజు, సోమశేఖర్, దినేష్, బాబురెడ్డి, ఎస్.మోహన్, నవీన్, లోకేష్‌తో పాటు పంచాయతీలోని యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.



జై జగన్ అంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన శకుంతల

పుత్తూరు: పేదలకు ఆపన్న హస్తం అందిస్తూ అందరికీ మంచి చేస్తున్న మంత్రి రోజా వెంటే తాను నడుస్తానని పుత్తూరు మండలం తడుకు గ్రామానికి చెందిన టీడీపీ మహిళా నేత పి.శకుంతల తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభురాజు, నాని, గంగాధరం ఆధ్వర్యంలో శకుంతల కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులకు తోడు రోజమ్మ సేవాతత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజమ్మ గెలుపునకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

చంద్రబాబుకు ఓటేస్తే మళ్లీ చీకటి రోజులే



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

– డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : మోసాల చంద్రబాబును నమ్మి ఓటేస్తే మళ్లీ చీకటి రోజులు తప్పవని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టో అంతా మోసమని, సూపర్ సిక్స్ పేరిట ప్రజలను బురిడీ కొట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని ఘాటుగా విమర్శించారు. మేనిఫెస్టోలో అప్పుడే అవ్వతాత పింఛన్ అంశాన్ని తొలగించారని చెప్పారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలు న్యాయం జరిగిందన్నారు. అనంతరం వెంగళరాజుకుప్పం దళితవాడకు చెందిన టీడీపీ నేతలు గోపి, సీమాన్ తదితరులు కలిపి 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా చేర్చుకున్నారు. కార్యక్రమంలో వీఆర్ కుప్పం యువత గోపి, యువరాజ్ పాల్గొన్నారు.

నేను ఎమ్మెల్యే అయితే.. పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతా

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న సారథ్యంలో జీడీ నెల్లూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మరో పులివెందులగా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకున్నా. మా తండ్రి డిప్యూటీ సీఎం నారాయణస్వామి అడుగుజాడల్లో పయనిస్తూ ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించి కళత్తూరు కుటుంబ గౌరవాన్ని మరింత రెట్టింపు చేస్తా₹₹ అని జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి సాక్షితో పలు విషయాలు పంచుకున్నారు. – కార్వేటినగరం

- జీడీనెల్లూరును పులివెందుల తరహాలో అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

- టీటీడీ శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో మా నాన్న 85 గ్రామాల్లో ఆలయాలు నిర్మించారు. నేను మరో 148 గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తా
- నియోజకవర్గంలో జరుగుతున్న 10,800 పక్కాగృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి పేదలకు అందిస్తా
- కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో నిర్మాణంలో ఉన్న 50 పడకల ఆస్పత్రిని వేగవంతంగా పూర్తి చేసి పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలన్న నా తండ్రి కోరికను నెరవేరుస్తా.



కళత్తూరు కృపాలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి, జీడీనెల్లూరు

- రూ.250 కోట్లతో రోడ్లను మా నాన్న పూర్తి చేయించారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లను గుర్తించి పూర్తి చేయిస్తా.
- స్మార్ట్ డీవీతో పాటు మరిన్ని పెద్ద కంపెనీలు మనదగ్గర ఏర్పాటయ్యేలా చొరవ చూపుతా. నియోజకవర్గాన్ని పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దితా.
- పురాతన ఆలయాలను టీటీడీలో విలీనం చేసిన ఘనత మా నాన్నది. వాటిని పూర్తిస్థాయిలో ఆధునీకరించడం నా బాధ్యత.
- ప్రజల రవాణా సౌకర్యార్థం ఫారెస్టును డీఫారెస్టు చేసి రహదారులు వేయించిన ఘనత కూడా మా తండ్రి, డిప్యూటీ సీఎం నారాయణస్వామిదే.
- నాలుగు మండలా ప్రజల సౌకర్యార్థం ఉడమలకృత్తి వద్ద కుశస్థలీ నదిపై రూ.27 కోట్లతో హైఓవర్ వంతెన నిర్మాణం పూర్తి చేసి నియోజవర్గానికి అంకితం చేసేందుకు కృషి చేస్తా.
- జగనన్న ఆశయాల మేరకు గ్రామాల్లో ఇప్పటికే 218 ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలు పూర్తి చేశారు. అలాగే ప్రతి గ్రామానికి ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించేలా బాధ్యత తీసుకుంటా.
- ఆళత్తూరు వరద వేంకటేశ్వరస్వామి ఆలయం, కనిగిరి వెంకటేశ్వరస్వామి ఆలయం, పాలసముద్రంలోని గోవర్ధనేశ్వర ఆలయం వంటి పురాతన ఆలయాల్లో ప్రతి నిత్యం ధూప, దీప నైవేద్యాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత నాపై ఉంది.
- ఆసియా ఖండంలో రెండోస్థానంలో నిలిచిన స్కంధ పుష్కరిణీలో నీరాలి మండపం నిర్మాణం పూర్తి చేసి కార్వేటినగరం ప్రజల కలను సాకారం చేసిన మా తండ్రి నారాయణస్వామిదే.
- 49 కొత్తపల్లిమిట్టలో రూ.50 కోట్లతో వ్యవసాయ మార్కెట్ నిర్మాణానికి కృషి చేస్తా. టీడీపీ అడ్డుకున్నా, ప్రజల కలను నెరవేరుస్తా.
- ఎన్టీఆర్ జలాశయం అభివృద్ధికి డిప్యూటీ సీంగా నారాయణస్వామి రూ.192 కోట్లు మంజూరు చేయించారు.
- వెదురుకుప్పం మండలంలో 20 ఎకరాల విస్తీర్ణంలో వైఎస్సార్ డిగ్రీ కళాశాల, అగ్నిమాపక కేంద్రం నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తా.
- ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవారికి అందించి అండగా నిలుస్తా.